సాక్షి సూర్యాపేట



శుక్రవారం । 8 । మార్చి । 2024

న్యూస్‌రీల్

పోలీస్ కుటుంబాలకు బాసట.. భద్రత పథకం

- ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం: పోలీస్ కుటుంబాలకు భద్రత పథకం బాసటగా నిలుస్తుందని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దస్తగిరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. రాష్ట్ర పోలీసు భద్రత పథకం ద్వారా వచ్చిన ఆర్థిక సహాయాన్ని గురువారం ఆయన కుటుంబ సభ్యులకు ఎస్పీ అందజేసి మాట్లాడారు. సిబ్బంది కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గోదావరి జలాల పునరుద్ధరణ

అర్వపల్లి: యాసంగి సీజన్‌కు గాను జిల్లాకు గోదావరి నీటిని ఐదవ విడతగా వారబందీ విధానంలో శుక్రవారం విడుదల చేయనున్నారు. ఈ నీళ్లు వారబందీ విధానంలో ఈ నెల 15 వరకు రానున్నాయి. ఈవిడతతో పాటు చివరగా ఆరో విడత ఈనెల 23 నుంచి 30 వరకు విడుదల చేయనున్నారు. ఎండలు తీవ్రం కావడం, ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు గోదావరి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ ఏఈ అమర్ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై మాట ఇచ్చి తప్పితే ఊరుకోం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికలప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ ఉచితమంటూ మాటిచ్చి ఇప్పుడు తప్పితే ఊరుకోబోమని రాజ్యసభ సభ్యులు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్. వెంకటరావును కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫ్రీ అన్నదని కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఇప్పుడు ఫీజు అంటోందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రజల నుంచి 30వేల కోట్ల రూపాయలను దోచుకోవాలని చూస్తోందని ఆరోపించారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ వద్దు, భూములను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న మాటను కాంగ్రెస్ తప్పిందన్నారు. అప్పుడు అడ్డగోలుగా మాట్లాడిన ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు నోరు ఎందుకు తెరవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ, జీడి భిక్షం, తూడి నర్సింహారావు, పుట్ట కిషోర్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్‌మిషన్) ఉద్యోగులకు మూడు నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్ వెంకటరావుకు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఎంకు కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో తెలంగాణకు రావాల్సిన రూ. 1000 కోట్లు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి ఆ బడ్జెట్‌ను రాష్ట్రానికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నిమ్మల ప్రభాకర్, స్వప్న, రాధా, బూర వెంకటేశ్వర్లు, నీరజ, శైలజ, ఉమ పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు


యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాత సేవ చేపట్టిన, నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన జరిపించారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.


వివక్షకు అడ్డుకట్ట పడలే..

- కొంతమేర స్వేచ్ఛగానే జీవించగలుగుతున్నాం
- ప్రభుత్వాలు మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలి
- మహిళా చట్టాలు మరింత కఠినతరం చేయాలి

'సాక్షి' సర్వేలో అతివల మనోగతం

సాక్షి నెట్‌వర్క్ : 'వంటింటి నుంచి సమాజాన్ని శాసించే స్థాయికి ఎదిగినం.. విద్య, వైద్యం, వ్యవసాయం, రాజకీయం ఇలా అన్ని రంగాల్లో రాణిస్తున్నాం. అయినా సమాజంలో ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉంది' అని పలువురు ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థినులు, ప్రైవేట్ ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, భువనగిరి, సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో గురువారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో 400మంది పాల్గొన్నారు. పలు అంశాలపై వారు తమ మనోగతాన్ని వెల్లడించారు. కొంతమేర తాము స్వేచ్ఛగానే జీవిస్తున్నట్లు పలువురు చెప్పారు. ఆడ, మగ అనే వివక్షలేకుండా సమాజంలో మార్పురావాలని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు కృషి చేయాలని సూచించారు. చట్టాలు ఎన్ని తీసుకొచ్చినా వేధింపులు, లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలు మరింత కఠినతరం చేయాలని పేర్కొన్నారు. స్వీయరక్షణ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలు సరిపోవని మరిన్ని పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.









మహిళల అభ్యున్నతిలో

పత్రికల పాత్ర కీలకం

- అతివలకు చేయూతనిచ్చే కథనాలు మరిన్ని రావాలి
- పథకాలపై అవగాహన కల్పించడంలో ముందుండాలి
- ఆడపిల్లపై వివక్ష పోతేనే మెరుగైన సమాజం
- నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన సూచన

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి'లో గెస్ట్ ఎడిటర్‌గా విధులు



'మహిళల్లో మల్టీ టాస్కింగ్ టాలెంట్ ఉంటుంది. కొందరు పిల్లలను పెంచుతారు.. కొందరు జాబ్ చేస్తుంటారు.. మరికొందరు ఇతర పనులు చూసుకుంటుంటారు. ఇదంతా మహిళల్లో పుట్టుకతోనే వస్తుంది. పురుషుడు సింగ్లర్‌గా ఉంటాడు.. ఒక్కటే డైరెక్షన్‌లో వెళతాడు. ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో పురుషుల కంటే దీటుగా రాణిస్తున్నారు.' - కలెక్టర్ హరిచందన

సాక్షి ఎడిటోరియల్ విభాగంలో గెస్ట్ ఎడిటర్ విధుల్లో కలెక్టర్ హరిచందన దాసరి



సాక్షి కార్యాలయంలో ఎడిటోరియల్ సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్

పరిశీలన.. సూచనలు

సాక్షి యూనిట్ కార్యాలయంలో ఒక రోజు గెస్ట్ ఎడిటర్‌గా విధులు నిర్వహించిన కలెక్టర్ హరిచందన.. ముఖ్యమైన వార్తలపై ఎడిటోరియల్ సిబ్బందితో చర్చించారు. వార్తల ప్రాధాన్యం, ఎడిటింగ్ పరిశీలించి పలు సూచనలు చేశారు. మహిళల్లో చైతన్యం కలిగించే వార్తలకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా విలేకరులు తయారు చేసి పంపిన వార్తలను కలెక్టర్ చూసి ఆనందం వ్యక్తం చేశారు. 2023 సంవత్సరంలో జిల్లాలో క్రైం రేటు పట్టికను చూసిన కలెక్టర్ 'మహిళల క్రైం రేటు తగ్గింది కదా.. లా అండ్ ఆర్డర్ బాగా పని చేస్తుంద'ని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విభాగాలను పరిశీలించి సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. కార్యాలయం అంతా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గెస్ట్ ఎడిటర్ రోల్ చాలా బాగా నచ్చిందన్నారు. ఒక పత్రిక తయారు కావాలంటే దాని వెనుకాల ఎంతో మంది 24/7 పనిచేస్తేనే ఏ రోజుకారోజు పత్రిక తాజాగా బయటకు వస్తుందనే విషయం తెలిసిందని చెప్పారు. ఒక రోజు గెస్ట్ ఎడిటర్‌గా విధులు నిర్వహించి ఎన్నో తెలియని విషయాలను తెలుసుకున్నానని 'అయామ్ వెరీ హ్యాపీ' అన్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పత్రికల్లో కథనాలు మహిళల చైతన్యాన్ని చాటి చెప్పేలా ఉండాలని నల్లగొండ కలెక్టర్ హరిచందన దాసరి పేర్కొన్నారు. మహిళల అభివృద్ధికి దోహదపడేలా ఉన్న ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కలిగేలా మరిన్ని వార్తలు రాయాలని సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె నల్లగొండలోని 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో గెస్ట్ ఎడిటర్‌గా ఒక్క రోజు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల మార్పు అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలని.. ఆడ, మగ పిల్లలను సమానంగా చూసినప్పుడే మహిళకు సమాజంలో సరైన గౌరవం దక్కుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్యం పెంచుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఉద్యోగం, ఉపాధి కలిగించే పనులు చేసుకుంటూ ఆర్థిక స్వేచ్ఛను అలవర్చుకోవాలన్నారు.

మార్పు ఇంటి నుంచే రావాలి..

ఇంట్లో అబ్బాయి, అమ్మాయి ఉంటే అమ్మాయికి వంట చేయమని, అబ్బాయికి షాపు నుంచి ఏదైనా తీసుకురమ్మని చెబుతుంటారని.. అక్కడే ఇద్దరి విషయంలో వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. ఇంటి నుంచే అమ్మాయి, అబ్బాయిని సమానంగా చూసే విధానం వస్తే సమాజంలో మహిళలకు మరింత గౌరవం దక్కుతుందన్నారు.

పథకాలు ఎలా ఉపయోగించుకోవాలో తెలుసు..

ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి, గృహజ్యోతి, ఉచిత బస్సు ప్రయాణం విషయంలో మహిళలు చాలా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు ఫ్రీగా ఫీలవుతున్నారన్నారు. ఫ్రీడమ్ ఆఫ్ మూమెంట్ ఉందని.. గాంధీజీ అన్నట్లు (సో యూకెన్ మూవ్ విత్ అవుట్ ఫియర్) మహిళలు చాలా యాక్టివ్‌గా ఉన్నారని చెప్పారు. గ్యాస్ బుక్ నంబర్ కూడా తాను అడగ్గానే చెబుతున్నారని.. నంబర్లను అంతా వేగంగా చెబుతున్నారంటే ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలో వారికి తెలుసని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు కూడా పథకాలు ఎలా ఉపయోగించుకోవాలో అన్న విషయంపై అవగాహన కలిగి ఉన్నారని చెప్పారు. ఇది సంతోషకరమైన విషయమన్నారు.

స్వయం సమృద్ధితో చక్కని జీవితం

- నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి



నల్లగొండ క్రైం: మహిళలు స్వయం సమృద్ధిని సాధించినప్పుడే చక్కని జీవితం గడపవచ్చని జిల్లా ఎస్పీ చందనా దీప్తి పేర్కొన్నారు. ప్రతి మహిళ ఆ దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. మహిళలు ఎలా ఉండాలన్న అంశంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించడం ద్వారా కుటుంబాన్ని మంచిగా చూసుకోగలుగుతారని పేర్కొన్నారు. ఉన్నత చదువు, ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్ ద్వారానే సమానత్వం పొందగలుగుతారని చెప్పారు. తాము సంపాదించిన మొత్తాన్ని ఎలా ఇన్వెస్ట్ చేయాలనే విషయాలను మహిళలు తెలుసుకోవాలని సూచించారు. తద్వారా ఎవరిపై ఆధారపడకుండా జీవించవచ్చన్నారు. ఇందుకోసం ముఖ్యంగా స్కిల్స్‌ను డెవలప్ చేసుకుంటే ఆర్థికంగా బలోపేతం అవుతారని వివరించారు. చదువుతో విషయ పరిజ్ఞానం పెంచుకోవడం ద్వారా తమదైన ముద్ర వేయవచ్చని పేర్కొన్నారు. మహిళల భద్రతకు పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. అయితే ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఫిర్యాదు చేసే ధైర్యం ప్రతి మహిళలో ఉండాలని సూచించారు.

ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయమే

- సూర్యాపేట అదనపు కలెక్టర్ లత



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం వెంటే ఉంటుందని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే..

మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ఆమె అవని, విశ్వానికి జనని. ఆమె పుట్టుకే ఒక ఆనందం. ఆమె లేనిదే జననం... ఈ ప్రపంచానికి మనుగడే లేదు. నాడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ఆకాశంలో సగమవుతున్నారు. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ఆడపిల్ల పుట్టిందంటే భయ పడే రోజులు పోయి.... ప్రస్తుతం ఆడపిల్లను మహాలక్ష్మిలా కొలుస్తున్నారు. మహిళల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కును వినియోగించుకోవాలి. మహిళలు చదువుకుంటే అభివృద్ధి చెందుతారు. జిల్లాలో మహిళల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం. వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను అందిస్తాం. పని చేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మహిళలు వేధింపులకు గురైతే భయపడకుండా ఫిర్యాదు చేయాలి. ముఖ్యంగా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగాలి.

నీ ఘనత.. అన్వితర సాధ్యం

- పర్వతారోహణలో ప్రపంచ ఖ్యాతి పొందిన అన్వితారెడ్డి



ఎవరెస్టు శిఖరంపై అన్విత (ఫైల్)



భువనగిరి : పర్వతారోహణలో రాణిస్తూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు భువనగిరికి చెందిన పడమటి అన్వితారెడ్డి. ప్రపంచంలోనే ఎత్తయిన కిలిమంజారో, మౌంట్ ఎల్‌బ్రోస్, మౌంట్ ఎవరెస్ట్, మౌంట్ మనస్లూ పర్వతాలను అధిరోహించి ఎందరికో రోల్‌మోడల్‌గా నిలిచారు. భువనగిరి మండలం ఎర్రంబెల్లికి చెందిన అన్వితారెడ్డి పాఠశాల దశలో ఉన్నప్పుడే పర్వతారోహణపై దినపత్రికల్లో వచ్చే కథనాలను ఆసక్తిగా చదువుతుండేవారు. ఇంటర్‌లో ఆమెలో మరింత పట్టుదల పెరిగింది. ఇంటర్ పూర్తయిన అనంతరం భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో శిక్షణ పొందారు. 2015లో మొదటిసారిగా సిక్కిం రాష్ట్రంలోని రెనాక్ పర్వతాన్ని అధిరోహించి అందరి దృష్టిని ఆకర్షించారు.

పట్టు విడవకుండా..

రెనాక్ పర్వతాన్ని అధిరోహించిన తరువాత అన్వితారెడ్డి డిగ్రీలో చేరారు. సెలవులు ఇవ్వకపోవడంతో శని, ఆదివారం రోజుల్లో ఖిలా వద్ద శిక్షణకు వెళ్లేవారు. డిగ్రీ పూర్తయిన అనంతరం 2019లో ఆంధ్రమహిళా సభలో ఎంబీఏ పూర్తి చేశారు. పర్వతారోహణపై ఆమెకున్న పట్టుదలను గుర్తించిన యూనివర్సిటీ అధికారులు.. నెల రోజులు సెలవులు ఇచ్చారు. ఈ సెలవుల్లో సిక్కింలో ట్రెక్కింగ్ కోర్సు పూర్తి చేశారు.

అన్విత అధిరోహించిన ఎత్తయిన పర్వతాలు

- ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి తన కల సాకారం చేసుకున్నారు.
- లడక్‌లోని ఖాడే పర్వతాన్ని మైనస్ 30 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించి శీతాకాలంలో పర్వతారోహణ చేసిన మొదటి భారతీయ మహిళగా రికార్డు సృష్టించారు.
- యూరప్‌లోని ఎల్‌బ్రోస్ పర్వతాన్ని మైనస్ 52 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించారు.
- ఎవరెస్టును అధిరోహించి జాతీయ పతాకం ఎగురవేశారు.
- మౌంట్ మానస్లూ పర్వతాన్ని మైనస్ 48 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించారు.
- దక్షిణాఫ్రికాలో పర్వతారోహణ కోసం వెళ్లేందుకు తీసిన వీసా తిరస్కరణకు గురవడంతో వెళ్లలేకపోయారు.

సహకరించని ఆర్థిక పరిస్థితులు

ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన ఏడు పర్వతాలను 18 నెలల్లో అధిరోహించాలన్నది అన్వితారెడ్డి లక్ష్యం. కానీ, ఇంట్లో ఆర్థిక పరిస్థితులు ఆమెకు సహకరించలేదు. దాతలు ముందుకొచ్చినా పూర్తిస్థాయి సహకారం అందలేదు. అయినా లక్ష్య సాధనలో వెనుకంజ వేయలేదు. స్వయంగా రూ.30 లక్షలు అప్పు చేసి 2021 జనవరిలో తన సాహసయాత్ర ప్రారంభించారు. ప్రస్తుతం అప్పు తీర్చేందుకు భువనగిరి ఖిలా వద్ద రాక్‌క్లైంబింగ్ స్కూల్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేయడంతో పాటు పాఠశాలల్లో రాక్ క్లైంబింగ్‌పై విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు.

మహిళాభివృద్ధితోనే దేశ పురోగతి



కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటరావు

- కలెక్టర్ వెంకటరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మహిళాభివృద్ధితోనే దేశ పురోగతి అని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సమాజ సేవలో మహిళలు ముందుంటున్నారని, ఓర్పు, సహనంతో కుటుంబాలను తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. జిల్లాలో అదనపు కలెక్టర్లు ఇద్దరు కూడా మహిళలు కావటం చాలా అదృష్టంగా భావిస్తున్నానని, వారి సహకారంతో జిల్లాను అభివృద్ధిలో ముందంజలో ఉంచుతానని చెప్పారు. అర్హులైన వారందరికీ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. పీఎంఎఫ్‌ఎంఈలో జిల్లాను మొదటి ర్యాంక్‌లో ఉంచినందుకు మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పని చేసే ప్రదేశాల్లో మహిళలను ఎవరైనా వేధించినా, అగౌరవపర్చినా కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, డీడబ్ల్యూఓ వెంకటరమణ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రభుత్వ ఉద్యోగులనులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గులు, వ్యాసరచన, పాటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేసి సన్మానించారు. అనంతరం 15 మంది దివ్యాంగులకు స్కూటీలు, 6 త్రీవీలర్ చైర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కుమారి, పార్వతి, మల్లెల రాణి, అనిత, జెడ్పీటీసీ మందాలపు కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

- మహాశివరాత్రికి ముస్తాబు



సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌లో మహాశివరాత్రి సందర్భంగా విద్యుత్ దీపాల వెలుగుల్లో రామలింగేశ్వర ఆలయం

మునగాల జెడ్పీటీసీ అనర్హతపై హైకోర్టు స్టే

మునగాల(కోదాడ): మునగాల జెడ్పీటీసీ సభ్యురాలు నల్లపాటి ప్రమీల ఎన్నిక చెల్లదంటూ హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ కోర్టు ఈ నెల 5వ తేదీన ఇచ్చిన తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. వివరాలు.. 2019లో నల్లపాటి ప్రమీల టీఆర్‌ఎస్ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సీపీఎంకు చెందిన దేశిరెడ్డి జ్యోతిపై విజయం సాధించారు. కాగా నల్లపాటి ప్రమీల ముగ్గురు సంతానం ఉన్న విషయాన్ని నామినేషన్ పత్రాల్లో పేర్కొనకుండా దాచిపెట్టారని దేశిరెడ్డి జ్యోతి కోర్టును ఆశ్రయించారు. దీంతో హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి సాక్ష్యాధారాలు పరిశీలించి ప్రమీల ఎన్నిక చెల్లదంటూ అనర్హత వేటు వేశారు. కాగా హుజూర్‌నగర్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రమీల హైకోర్టును ఆశ్రయించగా బుధవారం స్టే ఇచ్చింది. దీంతో ప్రమీలకు ఊరట లభించింది. కాగా టీఆర్‌ఎస్ తరఫున జెడ్పీటీసీగా గెలిచిన ప్రమీల ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.

ఆగని వేధింపుల పర్వం

- మహిళలు, బాలికలపై అత్యాచార ఘటనలు
- జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు
- పెరిగిన మహిళల మిస్సింగ్, వరకట్నం కేసులు



'సరిగ్గా రెండు క్రితం సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓ బాలికను ప్రేమపేరుతో వేధించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అవమానాన్ని తట్టుకోలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడింది.'

'గత సంవత్సరం మే నెలలో కోదాడ పట్టణానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి కుమారుడితో పాటు మరో ఇద్దరు యువకులు ఓ యువతిని కిడ్నాప్ చేసి బంధించి లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురి యువకులను అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.'

సూర్యాపేట : మహిళల రక్షణకు ఎన్నో చట్టాలు వస్తున్నప్పటికీ.. వారిపై వేధింపులు మాత్రం ఆగడం లేదు. ప్రేమపేరుతో యువతులను లోబరుచుకునేందుకు వారిని కిడ్నాప్ చేస్తున్నారు. వివాహితులు వరకట్నంతో భర్తలు వేధిస్తుండడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొంతమంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. చిన్నారులపై లైంగిక దాడులు కూడా పెరిగాయి. ప్రభుత్వాలు మారినా మహిళలపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడంలో విఫలమవుతున్నాయి. షీ టీమ్, భరోసా లాంటి రక్షణ వ్యవస్థలను తీసుకొచ్చినా వాటితో మహిళలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పెరిగిన మిస్సింగ్, వరకట్నం కేసులు

సూర్యాపేట జిల్లాలో మహిళలకు సంబంధించిన కేసుల వివరాలు

	2022	2023
హత్యలు	04	06
అత్యాచారం	71	57
మిస్సింగ్	22	39
వరకట్న మరణాలు	03	04
ఈవ్‌టీజింగ్	04	02
వరకట్నం కేసులు	291	316
ఫోక్సో	82	93

తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం ఉండాలి



మహిళలు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి. ప్రతి ఇంట్లో తల్లిదండ్రులను ఆడపిల్లలకు చిన్ననాటి నుంచి విద్యనందించాలి. అన్ని రంగాల్లో పనిచేసే మహిళలు పెరగాలి. ఎంచుకున్న రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రులతో పాటు భర్త ప్రోత్సాహం ఎక్కువగా ఉండాలి.

– జయమ్మ, గృహిణి, సూర్యాపేట

మహిళా శక్తిని గుర్తించాలి



మహిళా దినోత్సవం అనే పదం ఒక్కరోజులో పోయే బాధ్యత కాదు. ప్రతి మహిళ తన దైనందిన జీవితంలో స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రతిబింబించే విధంగా ప్రతి ఒక్కరి చర్యలు ఉండాలి. ఆధునిక కాలంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. మహిళా శక్తిని గుర్తించాలి. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి వారి సహకరిస్తే చాలు.

– స్నేహలత, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి దుర్మరణం

భానుపురి (సూర్యాపేట): ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో గురువారం జరిగింది. వివరాలు.. నడిగూడెం మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన కొమ్ము ఆనందరావు(60) సూర్యాపేటలోని పీజీఎఫ్ నర్సింగ్ కాలేజీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. అతడు గురువారం స్వగ్రామంలో ఆసరా పెన్షన్ తీసుకునేందుకు వెళ్తూ సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో కోదాడ డిపోకు చెందిన బస్సు ఎక్కాడు. బస్సు బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా అందులో సీట్లు లేవని తెలిసి ఆనందరావు బస్సు దిగబోతూ కిందపడిపోయాడు. ఇది గమనించిన డ్రైవర్, కండక్టర్ బస్సును ఆపగా.. అప్పటికే బస్సు వెనుక టైరు ఆనందరావు కాలు మీద నుంచి పోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

చిలుకూరు: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చిలుకూరు హరిజనవాడ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఈటా జిల్లా రాజపురం గ్రామానికి చెందిన ధర్మేందర్(22) బట్టల వ్యాపారం చేస్తూ హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపు బైక్‌పై వెళ్తుండగా.. అదే మార్గంలో వస్తున్న లారీ చిలుకూరు మండల కేంద్రంలోని హరిజనవాడ సమీపంలో బైక్‌ను వెనక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధర్మేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు.

బైక్‌పై వెళ్తూ స్తంభాన్ని ఢీకొట్టిన యువకుడు

నాగార్జునసాగర్: బైక్‌పై అతివేగంగా వెళ్తూ ఓ యువకుడు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో జరిగింది. వివరాల ప్రకారం.. పైలాన్ కాలనీకి చెందిన విఘ్నేశ్వర్ బైక్‌పై అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నల్లగొండకు తీసుకెళ్లారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

కుటుంబం కోసం ఖర్చు చేస్తున్నా



కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ప్రయాణం పథకం బాగుంది. ఎంతోమంది మహిళలకు ఈ పథకం ద్వారా మేలు జరుగుతోంది. ఉచిత బస్సు ప్రయాణంతో మిగిలే సొమ్మును కుటుంబం కోసం వినియోగిస్తున్నా. డబ్బులు కొంతైనా పేద, మధ్య తరగతి ప్రజలకు చాలా ప్రయోజనకరం.

– యలగందుల లలిత, సూర్యాపేట

ఎంతో మంచి పథకం



ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నాలాంటి ఎంతోమంది మహిళలకు ప్రయోజనం కలుగుతుంది. పథకం ఉద్దేశం ఏదైనా పేద, మధ్యతరగతి మహిళలు లబ్ధిపొందుతున్నారు. ఈ పథకం ద్వారా మిగులుతున్న డబ్బును పిల్లల భవిష్యత్తుకు జమ చేస్తున్నా. ఇది ఎంతో మంచి పథకం.

– చెవుగాని నాగమ్మ, తుంగతుర్తి

ఉపయోగకరంగా ఉంది



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న యాదగిరిగుట్ట పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, కంప్యూటర్ వంటి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. అవి నేర్చుకోవడానికి నేను నిత్యం వెళ్లి వస్తున్నాను. ఉచిత బస్సు సౌకర్యంతో నెలకు సుమారు రూ.1500 వరకు బస్సు చార్జీలు ఆదా అవుతున్నాయి.

– పెంట స్రవంతి, గృహిణి , రాజాపేట

మురిసిన 'మహాలక్ష్మి'

- మహిళలకు ఆసరాగా ఉచిత బస్సు ప్రయాణం
- పనిచేసే అతివలకు కలిసొస్తున్న పథకం
- ఈయేడు మహిళలకు వరం

రేపటికి ముందడుగు

ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మహిళలకు అండగా నిలుస్తోంది. అసంఘటిత కార్మికులు, చిన్నాచితక వ్యాపారాలు, ఇతర పనులు చేసే మహిళలతో పాటు వ్యవసాయం, పిల్లల బాగోగులు చూసేందుకు, తల్లిదండ్రుల వద్దకు ఇలా నిత్యం ఏదో ఒక పనిపై బస్సుల్లో మహిళలు ప్రయాణిస్తూనే ఉంటారు. ఈ క్రమంలో మహాలక్ష్మి పథకం ఎంతో మేలు చేస్తుందని మహిళలంతా సంబరపడుతున్నారు. ఉచిత ప్రయాణంతో మిగిలిన కొద్దిపాటి సొమ్ము అయినా తమ కుటుంబ అవసరాలకు ఆసరాగా ఉంటుందని చెబుతున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు (ఫైల్)

తక్షణ అవసరాలు తీర్చుకుంటున్నాం



ఏదైనా సామగ్రి కావాలనుకుంటే వెంటనే బస్సులో పట్టణ ప్రాంతాలకు వెళ్లి కావల్సిన వస్తువులను కొనుగోలు చేసి అవసరాలను వెంటనే తీర్చుకోగలుగుతున్నాం. రవాణ ఆర్థికభారం తగ్గడంతో డబ్బు ఆదా అవుతుంది. మిగిలిన డబ్బును ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నాం.

– మౌనిక, గుర్రంపోడు

రోజుకు రూ.60 మిగులుతున్నాయి



నేను హైదరాబాద్‌లో బీటెక్ ఫైనలియర్ చదువుతున్నా. కూకట్‌పల్లి హాస్టల్‌లో ఉంటున్నా. అక్కడి నుంచి బాచుపల్లి కాలేజీకి రోజు వెళ్లి రావడానికి రూ.60 ఖర్చయ్యేవి. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణంతో ఆ మొత్తం నాకు మిగులుతోంది.

– తాళ్లపల్లి శ్వేత, రహీంఖాన్‌పేట, ఆత్మకూరు(ఎం) మండలం

నెలకు రూ.2 వేలు ఆదా అవుతున్నాయి



నేను రోజూ క్రమం తప్పకుండా ఆఫీస్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో నెలవారీగా రూ.2000 ఖర్చు అయ్యేది. ఉచిత బస్సు ప్రయాణంతో మాకు కొన్ని డబ్బులు ఆదా అవుతున్నాయి. మహిళలు ప్రాధాన్యం కల్పించి, ఇలాంటి పథకం తీసుకురావడం ఆనందంగా ఉంది.

– రాళ్లబండి నాగరాణి, శ్రీరామ్‌నగర్, యాదగిరిగుట్ట

ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో దినసరి కూలీ చేసే మహిళలకు ఉపయోగకరంగా ఉంది. విద్యార్థినులు బస్ పాస్‌లకు చెల్లించే డబ్బులు మిగులుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో రోజుకు సగటున రెండు లక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగిస్తున్నారు.

– శ్రీదేవి, ఆర్ఎం నల్లగొండ

మహిళలం.. మేం మహారాణులం



మహిళలం మహిళలం
మేం మహారాణులం
వనితలం వనితలం
మేం వీర వనితలం
తెంచేశాం, తుంచేశాం .
దాస్యపు సంకెళ్లనే తెంచేశాం
వచ్చేశాం వచ్చేశాం బానిస బతుకుల చీకట్లను
చీల్చుకుంటూ వచ్చేశాం

మూఢాచారం మతాచారం ఏదైనా పోరాడేశాం
వంటింటి చాకిరి అత్తింటి వేధింపులు ఏదైనా తొక్కేసాం
విద్యకై విరామంలేని పోరాటమే చేశాం
హక్కులన్నింటినీ పొందే హక్కునే సాధించేశాం

ఏ రంగమైనా మాకు అందాలి,
ఏ వృత్తైనా మాకు వంగాలి
చందమామ అయినా గగన తలమైనా నడి సముద్రమే
అయినా మా ఆనవాలు కనబడాలి
పాపం స్త్రీలు అనే జాలి కబుర్లు మేమెందుకు
వినాలి, అమ్మో స్త్రీలు అనే మీరు అనాలి

సునీత విలియమ్స్ నుంచి నిర్మలా సీతారామన్ వరకు
మేడం క్యూరీ నుంచి కోనేరు హంపి వరకు
ఇలా ఏ రంగమైనా మా ముద్రను చూసి
మీరు ఉలిక్కిపడాలి
వయసు వావి వరసా సంబంధం లేకుండా
జరుగుతున్న శారీరక దాడులు ఆగాలి
లేదంటే ఈ సృష్టినే ఆపేసి
కాళీమాత అవతార మెత్తేసి
ఉచ్ఛం నీచం వదిలేస్తున్న మానవ మృగాలకు
బుద్ధి చెప్పేస్తాం

మేం మనుషులం, మేం మనుషులం
మానవ మనుగడను చనుబాలతో
పోషించేస్తున్న మానవతా మూర్తులం
ప్రేమించు గౌరవించు ఆదరించు
ఓ సమాజమా చేసేస్తా ఈ భూలోకాన్ని
స్వర్గం స్వర్గం..
నేను స్త్రీవాదిని కాదు సుమా
నేను మానవతావాదిని

– ఎస్. చందన, జూనియర్ సివిల్ జడ్జి, రామన్నపేట

మహిళల రక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- 'సాక్షి' రౌండ్ టేబుల్ సమావేశంలో అతివల అభిప్రాయం

నల్లగొండ టౌన్: మహిళల రక్షణ అందరి బాధ్యత అని, అతివల రక్షణకు పటిష్టమైన చట్టాలు కావాలని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళా సంఘం నాయకురాళ్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

సమానత్వం పోయింది



మహిళ అర్ధనారీశ్వరి.. అయినా నేటి సమాజంలో సమానత్వం లేదు. కట్టుబాట్ల నడుమ మహిళలు తమ సమస్యలను చెప్పుకోలేకపోతున్నారు. మహిళలపై వివక్షను మానుకోవాలి. మహిళలను గౌరవించినప్పుడే దేశం, సమాజం బాగుంటుంది. ఆ దిశగా ప్రభుత్వాలు పనిచేయాలి.

మాధవి, ఉద్యోగి

చట్టాలపై అవగాహన ఉండాలి



మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మహిళలు ఎదిగినప్పుడే మహిళా సాధికారిత లభిస్తుంది. చట్టసభల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.

– లక్ష్మి, ప్రభుత్వ ఉద్యోగి

సమాన హక్కులు ఉండాలి



మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు తెచ్చి అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపితేనే మహిళలకు రక్షణ ఉంటుంది. నేటి సమాజంలో మహిళపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించాలి.

– రమాదేవి, టీఎన్‌జీఓ నాయకురాలు

పటిష్టమైన చట్టాలు తేవాలి



ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. కొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నా ముందుకు సాగుతూ తమ సత్తా చాటుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా స్త్రీలు నేటికీ వివక్షకు గురవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. వాటిని అరికట్టేందు ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు తేవాలి. మహిళల గొప్పతనాన్ని తెలియజేసేలా, మహిళా సాధికారితకు పట్టం కట్టేలా ప్రతి ఏటా మార్చి 8న ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాం.

– పాలడుగు ప్రభావతి, ఐద్వా జిల్లా కార్యదర్శి

ఆదర్శ మహిళా రైతు



ఆవులకు దాణా పెడుతున్న మహిళా రైతు పావని

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల గ్రామానికి చెందిన మహిళా రైతు పడమటి పావని పలు రకాలుగా వ్యవసాయ ఆధారిత ఉపాధి మార్గాలను అన్వేషిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పదేళ్లకు పైగా 50 ఆవులతో డెయిరీ యూనిట్ నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. వీటికి తోడు 30 గొర్రెల పొటేళ్లు, 500 నాటు కోళ్ల పెంపకాన్ని చేపట్టారు. ఇటీవల పదెకరాల్లో వక్క తోటను సాగుచేస్తున్నారు.

పర్యాటక కేంద్రంగా భువనగిరి ఖిలా



భువనగిరి ఖిలా అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని



పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

- మొదటి దశ అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని
- పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: భువనగిరి ఖిలా గొప్ప పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భువనగిరి ఖిలా మొదటి దశ అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి ఖిలా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.118 కోట్లు కేటాయించగా, మొదటి దశ పనులకు రూ. 69 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో రోప్ వే, రోడ్లు, పార్కింగ్ వసతులు, ప్రారంభ ద్వారం, పర్యాటకులకు వసతులు, హరితవనాలు, విశ్రాంతి భవనాలు, సౌండ్ లైటింగ్, సాంకేతిక అభివృద్ధి పనులు జరుగుతాయని పేర్కొన్నారు. భువనగిరికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బస్వాపూర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. హెరిటేజ్ విలేజ్‌గా గుర్తింపు పొందిన భూదాన్‌పోచంపల్లిని అభివృద్ధి చేయనున్నామన్నారు. బీబీనగర్ మండలంలోని మహదేవ్‌పూర్ దేవాలయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయాల్సి ఉందని, సంబంధిత మంత్రిత్వ శాఖతో మాట్లాడానని తెలిపారు.

వసతులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

భువనగిరి ఖిలా మొదటి దశ అభివృద్ధి పనులు, కల్పించనున్న వసతులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ హనుమంతు కే.జెండగే వివరించారు. జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధితో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జెడ్పీటీసీ సభ్యులు బీరుమల్లయ్య, అనురాధ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ, కేంద్ర ప్రభుత్వ టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ మాతోశ్ నాస్కర్, రాష్ట్ర టూరిజం జనరల్ మేనేజర్ ఎం.ఉపేందర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ నేత్ర, జిల్లా టూరిజం అధికారి ధనుంజనేయులు, జిల్లా అధికారులు, హెరిటేజ్ సిబ్బంది, కమిటీ సభ్యులు సద్ది వెంకటరెడ్డి, దిడ్డి బాలాజీ, అంజయ్య, సుర్వి శ్రీనివాస్, చందామహేందర్‌గుప్తా, జనగాం నర్సింహాచారి, గుర్రాల శ్రీనివాస్, సరిగడ కరణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోదాడ కేంద్రంగా దగ్గుమందు దందా

- గంజాయి తాగుతున్న యువకుల విచారణలో బయటపడిన వ్యవహారం
- ఈ మందుకు బానిసలుగా మారిన దాదాపు 800 మంది

కోదాడ: కోదాడ కేంద్రంగా సాగుతున్న దగ్గుమందు దందా బట్టబయలైంది. గంజాయి తాగుతున్న ఆరుగురు యువకులను కోదాడ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేయగా.. దగ్గు మందు దందా బయటపడింది. వారితోపాటు దాదాపు 800 మంది దీనికి బానిసలుగా మారారని విచారణలో తేలడంతో పోలీసులు ఖంగుతిన్నారు. గురువారం రాత్రి కోదాడ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ శంకర్, ఎస్ఐ గోవర్ధన్, సూర్యాపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దగ్గు మందు దందా వివరాలు వెల్లడించారు. వారం రోజుల క్రితం కోదాడ ఎక్సైజ్ పోలీసులు పట్టణంలో గంజాయి తాగుతున్న ఆరుగురు యువకులను పట్టుకున్నారు. వారిని విచారిస్తున్న సమయంలో గంజాయితోపాటు దగ్గు మందు కూడా తాగుతున్నట్లు తెలిసింది. కోదాడ పట్టణంలోని మూడు ఏజెన్సీలు కోడెన్ పాస్పేట్ (మత్తు కలిగించే రసాయనం) దగ్గు మందు సిరప్‌ను హుజూర్‌నగర్ నియోజకవర్గపరిధిలోని మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన దుర్గాభవాని మెడికల్ స్టోర్స్ యజమానికి అమ్మారు. ఈ దుకాణ యజమాని వీటిని కోదాడలోని యువకులు, విద్యార్థులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇతని నెట్‌వర్క్‌లో మొత్తం 800 మంది యువకులు, విద్యార్థులు ఉండగా.. ఒక్క కోదాడలోనే 300 మంది వరకు ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. గంజాయి దొరకని సమయంలో వీరు మత్తు కలిగించే దగ్గుమందును సేవిస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం.

ఇలా పట్టుకున్నారు..

కోదాడ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన గంజాయి సేవించే యువకులతో మఠంపల్లి మెడికల్ షాపు యజమానికి ఫోన్ చేసి తమకు దగ్గు సిరప్‌లు కావాలని అడిగించారు. అడ్వాన్స్‌గా ఫోన్‌పే ద్వారా పంపించారు. బుధవారం రాత్రి సదరు మెడికల్ షాపు యజమాని 10 దగ్గుమందు సీసాలతో పాటు 100 నైట్రోజపామ్ మాత్రలను తీసుకొని కోదాడకు రాగానే ఎక్సైజ్ పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. కోదాడలోనూ మూడు మెడికల్ ఏజెన్సీల నుంచి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు చెప్పడంతో పాటు ఈ దందా మొత్తాన్ని వివరించినట్లు తెలిసింది. ఎక్సైజ్ పోలీసులు ఈ విషయాన్ని జిల్లా ఔషధ నియంత్రణ అధికారులకు తెలపడంతో కోదాడలో తనిఖీలు నిర్వహించారు. పూర్తి సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ టెస్టుల్లో పట్టుబడకుండా ఉండేందుకు..

మఠంపల్లిలో ఈ దగ్గుమందు దందా భారీ ఎత్తున సాగడానికి కారణాలను కోదాడ ఎక్సైజ్ పోలీసులు కనుగొన్నారు. ఈ మండల కేంద్రానికి సమీపంలో పలు సిమెంట్ ఫ్యాక్టరీలున్నాయి. ఇందులో పనిచేసే సిబ్బంది మద్యం సేవించి వస్తే డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లో పట్టుబడుతామని, దీంతో ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని వారు భావించారు. దీనికి ప్రత్యామ్నాయంగా మత్తును కలిగించే ఈ దగ్గుమందుకు అలవాటు పడ్డారు. దీన్ని తాగితే మత్తు వస్తుంది.. కానీ డ్రంక్ టెస్ట్‌లో తెలియదని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఒక్కో మందు సీసా రూ.150 ఉండగా మెడికల్ షాపు యజమాని రూ.300 నుంచి రూ.400 వరకు అమ్ముతున్నట్లు తెలిసింది. సంవత్సర వ్యవధిలోనే ఇతను దాదాపు 10వేల మందు సీసాలు అమ్మినట్లు సమాచారం. కాగా.. కోదాడ కేంద్రంగా సాగుతున్న ఈ దందా గురించి 'సాక్షి' గత సంవత్సరం డిసెంబర్ 17న 'మత్తులో యువత చిత్తు' శీర్షికన ప్రచురించగా.. సాక్షి చెప్పిందే అక్షర సత్యమని తేలింది.

